ప్రజాశక్తి
ఆదివారం 3 మార్చి 2024
5
అనంతపురం



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తాం

కలెక్టర్ ఎం.గౌతమి



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని రెండు రోజుల్లోగా పూర్తి చేస్తామని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పీ,ఆర్డీ, ఎన్‌ఆర్‌ఈజిఎ – కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు, పరిశ్రమల శాఖ – ఎంఎస్‌ఎంఈ క్లస్టర్‌లకు భూ కేటాయింపు, వైద్యం తదితర వాటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 5.11 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు రావాల్సి ఉండగా, 1.90 లక్షల కార్డులు వచ్చాయన్నారు. ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 3.50 లక్షల ఆరోగ్యశ్రీ యాప్‌లు డౌన్లోడ్ పూర్తి అయ్యాయని, త్వరితగతిన మిగిలిన లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌లలో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌ని డ్రైవ్ మోడ్‌లో చేపడతామన్నారు. జిల్లాలోని 450 రైతు భరోసా కేంద్రాల్లో కమోడిటీ మానిటరింగ్ యాప్‌లో బయట మార్కెట్లో పంటల ధరలు ఏ విధంగా ఉన్నాయనే వివరాలు ప్రతిరోజు అప్‌లోడ్ చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియను చేపడుతున్నామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఎడి చౌదరి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ నాగభూషణం, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డిఐఒ యుగంధర్, ఎఫ్‌డిపి నోడల్ అధికారి డాక్టర్ సుజాత, మలేరియా అధికారి ఓబులు, డిపిఎంఒ డాక్టర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పెన్నానది వద్ద టిడిపి నాయకులు నిరసన

తాడిపత్రిలో ఉద్రిక్తత

చిచ్చురాజేసిన పైప్‌లైన్ వివాదం
టిడిపి, వైసిపి నేతల మధ్య మాటలయుద్ధం
పెన్నానదిలో ఇరువర్గాల నినాదాలు

తాడిపత్రి పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ వివాదం రాజుకుంటోంది. గత రెండు రోజులు టిడిపి, వైసిపి నేతల మధ్య ఈ వివాదం మాటల యుద్ధం నడుస్తోంది. శనివారం నాడు ఏకంగా రెండు వర్గాల వారు పెన్నానది వద్ద నీటి సరఫరా బోర్ల వద్దకెళ్లి తాము అభివృద్ధి చేస్తున్నామంటే.. తాము చేస్తున్నామంటూ ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలను అక్కడి నుంచి పంపి వేయడంతో సమస్య కాస్త సద్దుమణిగింది.

వార్త మెయిన్‌లో

కారుణ్య నియామకంపై కొట్లాట

◆సూపరింటెండెంట్ అనుచిత వ్యాఖ్యలు ◆కార్పొరేషన్‌లో కొట్టుకునే వరకు వెళ్లిన పరిస్థితి



కార్పొరేషన్ కార్యాలయంలోని ఓ విభాగం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో కారుణ్య నియామకం కింద రెగ్యులర్ పారిశుధ్య కార్మికుడు చంద్ర మృతితో ఆయన కుమారుడికి శుక్రవారం నాడు నియామక పత్రం అందజేశారు. ఈ నియామకంపై శనివారం నాడు ఇంజినీరింగ్ విభాగపు సూపరింటెండెంట్ అనుచిత వ్యాఖ్యలు చేయటంతో తీవ్ర వివాదం రాజుకుంది. 'మృతి చెందిన కార్మికుడి సంతానమేనా అన్న అంశంపై ఏదైనా పరీక్ష చేయించాలేమో' అంటూ సూపరింటెండెంట్ ఖయ్యూం వ్యాఖ్యలు చేయటం సిబ్బందిని ఆగ్రహానికి గురిచేసింది. మృతి చెందిన కుటుంబ పరమైన అంశంపై చేసిన వ్యాఖ్యలపై అవుట్‌సోర్సింగ్ కార్మికుడు చిరంజీవి రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మృతి చెందిన కార్మికుడు నేపాలి కావడంతో కుమారుడికి స్థానిక భాష రాకపోవటంతో నిజంగా ఆ కుటుంబానికి చెందిన వాడేనా అంటూ సూపరింటెండెంట్ అభ్యంతర వ్యాఖ్యలు చేయడంతో తీవ్ర వాదులాట జరిగింది. కంపోస్టు యార్డులో పనిచేస్తున్న చంద్ర కొంత కొంతకాలం క్రితం గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. ఆయన కుమారుడు కారుణ్య నియామకం కింద దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి శుక్రవారం నాడు ఆయనకు నియామక పత్రం అందజేశారు. కారుణ్య నియామకం పొందిన ఆకుర్రాడిని కమిషనర్ మేఘ స్వరూప్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసేందుకు నియమించుకున్నారు. ఈ కారుణ్య నియామకంపై సూపరింటెండెంట్ ఖయ్యూం అనవసరంగా అక్కసు వెళ్లగక్కారు. సూపరింటెండెంట్ ఖయ్యూం కూడా తండ్రి మృతితోనే కారుణ్య నియామకం కింద గుమాస్తాగా చేరిన వ్యక్తి అయినా మరో కారుణ్య నియామకం కింద నియమితుడైన చంద్ర కుమారుడిపై అసభ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను పలువురు తప్పుబట్టారు. కారుణ్య నియామకం వెనుక కాసులు కక్కుర్తి వ్యవహారం ఏమైనా ఉండొచ్చు అన్న అంశం ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గతంలోనూ సదరు అధికారి మరికొందరిపై ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. అధికారిక హోదాలో ఉన్న సమయంలో ఎదుటి వారి పట్ల గౌరవంగా ప్రదర్శించి మన్ననలు పొందేలా వ్యవహరించాలని పలువురు చిరుద్యోగులు సూచిస్తున్నారు.



అభివృద్ధి పనుల శిలాఫకాన్ని ప్రారంభిస్తున్న డిఐజి అమ్మిరెడ్డి

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత

అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

పోలీసు సిబ్బంది, పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ తగు చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ సంకల్పంతో పోలీసు సంక్షేమంలో భాగంగా నూతనంగా నిర్మించిన, పునరుద్ధరించిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను డిఐజి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం పునరుద్ధరణలో భాగంగా స్టేడియం పైభాగంలో సిమెంట్ రేకులు తొలగించి ఇనుప రేకులు, పెయింటింగ్, లైటింగ్, ప్రాంగణమంతా సిమెంట్ ఫ్లోరింగ్ పనులు కొత్తగా చేపట్టి పూర్తిచేశారు. పునరుద్ధరించిన ఇండోర్ స్టేడియంను ఎస్పీతో కలసి డిఐజి ప్రారంభించారు. పోలీస్ యూనిట్ ఆసుపత్రి పునరుద్ధరణ పనులోల భాగంగా నూతన ట్రెడ్ మిల్ మిషన్, 20 నూతన బెడ్స్, పురుషులు, మహిళలకు ప్రత్యేక బెడ్స్ కలిగిన ఏసీ వార్డు, లివర్, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్టులు, జాండీస్, హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలు నిర్వహించే పరికరాలు నూతనంగా ఏర్పాటు చేశారు. రెన్నోవేషన్ చేసిన పోలీస్ యూనిట్ ఆసుపత్రిని ప్రారంభించారు. జిల్లా పోలీస్ ట్రాన్సుపోర్ట్ విభాగం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఎంటి ల్యూబ్రికేషన్స్ స్టోర్స్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విధులు పక్కాగా ఎలా చేయిస్తామో వారి సంక్షేమానికి అంతే ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు బాగుంటేనే పోలీసు వ్యవస్థ బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాలలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మినారాయణరెడ్డి, డీఎస్పీలు జి.వీరరాఘవరెడ్డి, బివి.శివారెడ్డి, జి.మునిరాజ (ఎఆర్), ఎస్బీ సిఐ జాకీర్ హుస్సేన్, పీసీఆర్ సిఐ దేవానంద్, ఆర్ఐలు కె.రాముడు, కె.హరికృష్ణ, పోలీస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, జాఫర్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, తేజ్‌పాల్, ఆర్ఎస్ఐలు రమేష్ నాయక్, స్వామినాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు తెలిపారు. శనివారం పట్టణంలోని బళ్లారి బైపాస్ వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించిదన్నారు. ఇందులో ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అనే గ్యారెంటీని విడుదల చేసిందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసీపీ, టిడిపిలు స్వార్థ రాజకీయాలు చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే కచ్చితంగా ప్రత్యేక హోదా తీసుకొస్తామన్నారు. హోదా వస్తే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా నిరుద్యోగ వ్యవస్థను నిర్మూలించవచ్చన్నారు. 2014లో రాష్ట్రాన్ని విడదీసినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా ఇచ్చిన మాటను విస్మరించిందని గుర్తు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపిలు హోదా మాటను పూర్తిగా విస్మరించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హోదాతోపాటు రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికీ నెలకు రూ.5000 అందించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమిని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, సిపిఐ నాయకులు మల్లికార్జున, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు సోనియా సీన, ఓబులేసు, ఏపీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, వజ్రకరూరు మండల కన్వీనర్ శ్రీకాంత్ వర్మ, ఉరవకొండ పట్టణ కన్వీనర్ సుధాకర్, మైనారిటీ పట్టణ కన్వీనర్ ఖాన్, బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి రవి, నాయకులు లింగన్న, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'అనితరుడు' పుస్తక పరిచయ సభ


అనంతపురం కలెక్టరేట్ : ఖమ్మంకు చెందిన కవి మువ్వా శ్రీనివాసరావు కవితా సంపుటాలపై వెలువడిన వ్యాసాల పుస్తకం 'అనితరుడు' పుస్తక పరిచయ సభ ఆదివారం నగరంలోని జిల్లా గ్రంథాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు 'స్పందన' అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర్‌శాస్త్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రచయితల సంఘంతో కలిసి 'స్పందన' అనంత కవుల వేదిక నిర్వహిస్తున్న 366 వ్యాసాల సంపుటి 'అనితరుడు' పుస్తక పరిచయ సభకు డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షత వహిస్తారన్నారు. అలాగే ముఖ్య అతిథిలుగా ప్రముఖ దిగంబర కవి నగ్నముని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత 'శప్త భూమి' బండి నారాయణస్వామి, తూముచర్ల రాజారామ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

బండారు శ్రావణిశ్రీని కలిసిన నాయకులు



శ్రావణిశ్రీకి బొకే అందజేస్తున్న శింగనమల నాయకులు

శింగనమల : నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని శనివారం జిల్లాకేంద్రంలోని నివాసంలో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అభినందనలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తెలుగు యువత జిల్లా మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ శ్రావణిశ్రీని కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో శ్రావణిశ్రీని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నాయకులు గజ్జల అమర్నాథ్, చలపతి, అంజి, మురళి, సాయి, కిరణ్, రుచంద్ర, కిషోర్ యాదవ్, విజయ్, హర్ష నాయుడు, ధనుంజయ్, విశ్వ, చైతన్య, చరణ్, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.



శ్రావణిశ్రీతో పుట్లూరు మండల నాయకులు

పుట్లూరు : మండల నాయకులు అనంతపురంలోని శ్రావణిశ్రీ ఇంట్లో కలిసి అభినందనలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో టిడిపి నాయకులు నారాయణరెడ్డిపల్లి శ్రీనాథ్, రామునిరెడ్డి, మడ్డిపల్లి శివారెడ్డి, కోమటికుంట్ల రామచంద్రనాయుడు, తాజ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విహారయాత్రలో విషాదం

మహాబలిపురం బీచ్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు-హెలికాప్టర్ ద్వారా గాలింపు

కళాశాల విద్యార్థులందరూ సంతోషంగా విహార యాత్రకు వెళ్లారు.. వెళ్లిన మొదటి రోజే మహాబలేశ్వరంలో స్వామివారిని దర్శించుకున్నారు.. అక్కడి నుంచి సరదాగా బీచ్ వద్దకు వెళ్లారు.. అందరూ ఒక్కసారిగా సముద్రంలోకి ఈతకు దిగారు.. కేరింతలు కొట్టారు.. అంతలోనే విషాదం.. ఒక్కసారిగా విద్యార్థుల హాహాకారాలు... 22 మంది విద్యార్థులు ఈత కొడుతుండగా ఆరుగురు నీటిలో కొట్టుకుపోయారు.. అయితే అదృష్టవశాత్తు అక్కడే ఉన్న వారు నలుగురిని కాపాడారు.. మరో ఇద్దరు గల్లంతయ్యారు.. దీంతో విహార యాత్ర ఒక్కసారిగా విషాదయాత్రగా మారింది....

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

విద్యార్థులందరూ కలిసి తమిళనాడుకు వెళ్లిన విహారయాత్రలో విషాదం చోటు చేసుకుంది. విద్యార్థులందరూ సంతోషంగా సముద్రంలో ఈత కొడుతుండగా ఇద్దరు విద్యార్థులు గల్లంతైన ఘటన శనివారం తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకుంది. కళాశాల యాజమాన్యం, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్లకు చెందిన చిక్కం వెంకటరామిరెడ్డి కుమారుడు చిక్కం శేషారెడ్డి (20), యాడికి మండలంలోని కుందనకోట గ్రామనికి చెందిన పెద్దిరాజు (20) యాడికిలోని పెన్నా సిమెంటు కర్మాగారం వద్ద ఉన్న ఓ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదుతున్నాడు. వీరితోపాటు మరో 22 మంది విద్యార్థులు, నలుగురు కళాశాల సిబ్బంది కలిసి శుక్రవారం పుదుచ్చేరి, ఊటీ, మహాబలిపురం ప్రాంతాలకు విహారయాత్రకు వెళ్లారు. మొదట మహాబలిపురం వద్ద ఉన్న స్వామిని దర్శించుకుని సముద్రంలో ఈత కొడుతున్న సమయంలో ఆరుగురు విద్యార్థులు గల్లంతు అయ్యారు. అయితే అక్కడే ఉన్న కొందరు గమణించి నలుగురిని రక్షించారు. శేషారెడ్డి, పెద్దిరాజు అనే విద్యార్థులు గల్లంతు అయ్యారు. ఇద్దరు విద్యార్థుల ఆచూకీ కనిపించకపోవడంతో ఆప్రాంత అధికారులు హెలికాప్టర్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ రోషన్, ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. కాగా వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న చిక్కం వెంకటరామిరెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. చదువు కోసం పెన్నాసిమెంటు కర్మాగారం ప్రాంతలో వదిలిపెట్టగా విహార యాత్రకు వెళ్లి ఇలా ప్రమాదంలో చిక్కుకోవడంపై కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు కారులో తక్షణమే మహాబలిపురం ప్రాంతానికి తరలివెళ్లారు. ఇద్దరు విద్యార్థులు గల్లంతు



గల్లంతైన విద్యార్థులు (పాతచిత్రాలు)

రూ.21వేల వేతనం మంజూరుకు జీవో జారీ

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సంబరాలు





అనంతపురం, గుంతకల్లులో సంబరాలు చేసుకుంటున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేసి సాధించుకున్న 21000 జీతం జీవో విడుదల సందర్భంగా అనంతపురం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా రంగులు చల్లుకుంటూ బాణాసంచా పేలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజుకు పూలమాలలు వేస సన్మానించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి రఘువీరా టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ వచ్చి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఐక్య పోరాటం ఫలితంగానే జీవో జారీ అయిందన్నారు. అయితే పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచి ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు సాంకేతిక సమస్యలు కారణంగా చూపి ఐఎఎస్‌ల కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వారికి కూడా వేతనాలు పెంచేంత వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా నాయకురాళ్లు మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, పర్మినెంట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముత్తురాజు, సర్దానమ్మ, జిల్లా కోశాధికారి ఆదినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఆదినారాయణ, మరియమ్మ, గురురాజు, శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో జారీ చేయడం పట్ల సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, నాయకులు మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి



పదోన్నతి పొందిన కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

శ్రీ సత్యసాయి జిల్లా పట్నం పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న నూర్ మహమ్మద్, హిందూపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న నీలవేణికు హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా పదోన్నతి లభించింది. వీరిలో నూర్ మహమ్మద్‌ను కనగానపల్లి, నీలవేణిని గుంతకల్లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ కెకెఎన్ అన్బు రాజన్‌ను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లాలో పని చేస్తూ ఇటీవల అనంతపురం ఏఆర్‌కు బదిలీ అయిన ఆర్ఎస్ఐ జాఫర్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడి హోదాలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమాల్లో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, జాఫర్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే పేదల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే విశ్వ



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో వైసిపితోనే పేదల అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో 'ఇంటింటికీ మన విశ్వన్న' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎక్కడికి వెళ్లినా సంతోషంగా ఉన్నామని ప్రజలందరూ చెబుతున్నారన్నారు. జగనన్న సంక్షేమ పథకాల వల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందారులు, పేదల మధ్య జరుగుతున్న ఎన్నికలుగా అభివర్ణించారు. అంతకుముందు ఉరవకొండలోని 8వ వార్డులో భజన మందిరం వద్ద రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ సిఎం..విశ్వన్న ఎమ్మెల్యే కావాలని పాదయాత్ర

జగన్ మళ్లీ సిఎం కావాలని, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్యే కావాలని కోరుతూ సిఎం జగన్ అభిమాన సంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి శనివారం పాదయాత్ర చేపట్టారు. ఉరవకొండ మండలంలోని పెన్నఅహోబిలం క్షేత్రం నుంచి ప్రారంభమైన పాదయాత్రను వై.విశ్వేశ్వరరెడ్డి సతీమణి భువనేశ్వరి ప్రారంభించారు. ముందుగా ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. కసాపురం వరకూ చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని భువనేశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి వజ్రకరూరు యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రంగనాథ్‌యాదవ్, రమేష్, ప్రభాకర్, నరసింహులు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, ఓబుళేసు, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-నార్పల

కర్నూలు ఏఏ ఆసుపత్రి, సోదరులు రంగయ్య, సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని తిక్కయ్యస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరాన్ని వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వైద్యశిబిరంలో 300 పైచిలుకు మందికి దగ్గు, జలుబు, జ్వరం, బీపీ, షుగర్, థైరాయిడ్, మొలలు, ఫిస్టులా, అపెండైటిస్, హెర్నియా, కండరాల్లో వాపు, వరిబీజం వాపు, సంతానలేమి సమస్యలు, గర్భసంచి ఆపరేషన్లు, ఎముకలు విరిగిన, ఎముకల సాంద్రత, ఊపిరితిత్తుల, గుండె సమస్యలు, కిడ్నీ, నరాల బలహీనత వంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సర్పంచి మాన్నిల సుప్రియ, ఉప సర్పంచి శ్రీరాములు, ఎంపిటిసిలు కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు సిద్దరాచెర్ల సర్పంచి రామాంజనేయులు, పప్పూరు నరసింహులు, భాస్కర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఖాదర్‌వలి, అమీర్‌బాషా, జిలాన్‌బాషా, రామకృష్ణ, రమేష్, గోపాల్, మోహన్, రంగారెడ్డి, రామానాయుడు, నాగభూషణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ మహమ్మద్ మహమ్మద్ వసీం, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. పల్స్ పోలియోపై శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యానికి ప్రధాన కారణం పోలియో చుక్కలు వేయించకపోవడమే అన్నారు. ఈనెల 4, 5వ తేదీల్లో నగరవ్యాప్తంగా 122 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. వీధిబాలలు బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ దేవి, సిడిపిఒ శ్రీదేవి, డాక్టర్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల నుంచి బస్టాండులోని గాంధీ సర్కిల్ వరకూ వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ సాధియా, వైద్య సిబ్బంది అక్కులప్ప, మునిరెడ్డి, ప్రమీల, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి శ్రీవాణి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పోలియో చుక్కలు వేయించడం ద్వారానే అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

ఉరవకొండ : పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ వైద్యాధికారులు పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండతో పాటు మండల పరిధిలోని రాకెట్లు, పెద్ద కౌకుంట్ల పీహెచ్‌సీల పరిధిలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి రంపపు కోత కొట్టాల వద్ద మానవహారం ఏర్పాటు చేసి పోలియో రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సహితి, వినిత, పివి అనికేత్, పావని, సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎంఓ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, వెంకటేసులు, స్వర్ణలత, సచివాలయ పద్మావతి, వైద్య సిబ్బంది డీజే కైలాసం, అర్జున, సుభాషిణి, మాలక్ష్మి, సుమలత, లక్ష్మీప్రసాదరావు, నాగరాజు, నీలావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని శ్రీధర్‌ఘట్ట, దర్గాహొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శనివారం పల్స్ పోలియోకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5514 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. వారందరికీ పోలియో చుక్కలే వేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.


రాయదుర్గం : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి రాణి సత్రం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారి మాధవి, వైద్యులు సందేశ్, రమేష్, అజార్‌ఖాన్, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మేయర్ మహమ్మద్ వసీం, జెడ్పీ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

వైసిపితో విసిగిపోయిన ప్రజలు : ఎమ్మెల్యే కేశవ్



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ : వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు విసుగు చెందారన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో వైసిపి ఎన్నికల ప్రచారం



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న వైసిపి నాయకులు

రాయదుర్గం : పట్టణంలోని 28, 29వ వార్డుల్లో వైసిపి ఎన్నికల అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైసిపికే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస, వలీబాషా, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ శివప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ మృతి

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఓ వ్యక్తి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన మనోహర్ (34) సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవారు. ఈనేపథ్యంలో గతనెల 24న తొండపాడు గ్రామంలోని రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు నడుచుకుంటూ వస్తుండగా 67వ జాతీయ రహదారిపై ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరులోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య

గార్లదిన్నె : మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామం దగ్గర పంట పొలాల్లో శనివారం గుర్తు తెలియని వృద్ధుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

వృద్ధుడు అదృశ్యం

అనంతపురం క్రైం : బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ధరణీకిషోర్ తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎంజీ కాలనీకి చెందిన 70ఏళ్ల వృద్ధుడు నారాయణప్ప శుక్రవారం ఉదయం బజారుకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు సీఐ 9490618679, ఎస్ఐ 9346917115 ఫోన్ నెంబర్లకు తెలిపాలన్నారు.

121చీనీ చెట్ల నరికివేత



నేలకూలిన చీనీచెట్లు


శింగనమల : మండల పరిధిలోని పెద్ద జలాలపురం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి చీనీచెట్లను నరికారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు గంగరాజుకు చెందిన 2.75 ఎకరాల్లో 420 చీనీ చెట్లను నాలుగేళ్ల నుంచి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం చెట్లు కాపునకు వచ్చాయి. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు 121 చీనీ చెట్లను నరికివేశారని బాధిత రైతు లబోదిబోమన్నాడు. ఉదయం తోటకు వెళ్లిన రైతు చీనీ చెట్లను నరకడాన్ని గమణించి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సిఐ శ్రీధర్, ఎఎస్ఐ చిదంబరి, సిబ్బందితో వెళ్లి నరికిన చీనీచెట్లను పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విద్యుత్ సామగ్రి చోరీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ సామాగ్రిని చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. నరసింహులు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్‌కు సంబంధించిన వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన మూడు స్టార్టర్ బాక్స్ లు, తిప్పేస్వామి నాయక్ పొలంలో కేబుల్ వైరు చోరీకి గురైనట్లు బాధిత రైతులు వాపోయారు.

పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే లక్ష్యం

వినికిడి దినోత్సవంలో కిమ్స్ సవీరా డాక్టర్ రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న కిమ్స్ సవీరా డాక్టర్ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే తమ లక్ష్యమని కిమ్స్ సవీరా ఆసుపత్రి డాక్టర్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న వారికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేయిస్తే బ్రహ్మాండంగా వినగలగడమే కాకుండా చక్కగా మాట్లాడే అవకాశం కూడా వస్తుందన్నారు. ఇందులో భాగంగా కిమ్స్ సవీరా ఆస్పత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిపుణుడు ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ 26 మందికి పూర్తి ఉచితంగా ఈ ఆపరేషన్లు చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సకు రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఖర్చు అవుతుందన్నారు. అయితే ఆస్పత్రిలో మాత్రం ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్, అడిప్ లాంటి పథకాల ద్వారా వీటిని పూర్తి ఉచితంగా చేశామన్నారు. వీటితో పాటు రెండు సంవత్సరాల స్పీచ్ థెరపీ కూడా ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త తరిమెల అమర్‌నాథరెడ్డి, కిమ్స్ సవీరా ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అబిబ్ రాజా, అనస్థీషియా డాక్టర్ రవిశంకర్, పీడియాట్రీషన్ డాక్టర్ మహేష్, ఆడియాలజిస్ట్ డాక్టర్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు : చంద్రబాబు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ కన్వీనర్ బోయ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు ఈనెల 4న పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ ఎదుట 'రా కదలిరా' అనే బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, మాజీ కన్వీనర్ కృష్ణమోహనచౌదరి, మాజీ ఎంపిటిసి రంగనాథ్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు హరి, బూత్ కన్వీనర్ రాజు, బూత్ కన్వీనర్ పరంధామ, సీనియర్ నాయకులు సనప నాగన్న, తలారి నాగరాజు, తలారి నాగరాజు, రాజు, డిష్ నాగరాజు, కురుబ పోతులయ్య, పరంధామరెడ్డి, మాబు, మేలు గోవిందు, కొంగానే చిన్నరాయుడు, బలిజ నాగేంద్ర, గోపాల్‌రెడ్డి, బలిజ నాగార్జున, మిషన్ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

'కాలవ' ఎన్నికల ప్రచారం ప్రారంభం



మహిళకు కరపత్రం అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాల్ : మండలంలో ప్రసిద్ధి చెందిన మురిడి ఆంజనేయస్వామి ఆలయంలో టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామికి 1,116 టెంకాయలు సమర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగుతోందన్నారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈ సమయంలో రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, యువతకు ఉపాధి దొరకాలన్నా టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

వైసిపిలో చేరిన టిడిపి సర్పంచి బంగి మల్లేష్

ప్రజాశక్తి-అనంతపురం

కనగానపల్లి మండలం తూముచెర్ల సర్పంచి బంగి మల్లేష్ శనివారం వైసిపిలో చేరారు. ఈమేరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ టిడిపి విధానాలు, పరిటాల కుటుంబ వైఖరి నచ్చక పార్టీని వీడినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

టిడిపి నాయకుల 'భవిష్యత్తుకే గ్యారెంటీ' లేదు..

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఇళ్ల పట్టాల పంపిణీలో నాయకులు



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ఇంటింటికీ వస్తున్న టిడిపి నాయకుల భవిష్యత్తుకే గ్యారెంటీ లేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జెసి సోదరులను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. జెసి సోదరులు కేవలం గ్రామాల్లో కక్షలు రేపేందుకే వస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అభివృద్ధికి డోకాలేదన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, నాడు-నేడు కింద పాఠశాల భవనాలు అనేక పథకాల ద్వారా ప్రజలకు చేరువ చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ హరినాథరెడ్డి, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మాజీ జడ్పిటిసి చిదంబరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు గోవర్ధనరెడ్డి, సర్పంచి వరలక్ష్మి, ఎంపిపి శ్రీదేవి, ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా శనివారం రూరల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి సంబంధించిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాల మేరకు జగనన్న కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కావున మరోసారి జగన్ తోడుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : సిఎం జగన్ చేసిన సాయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. శనివారం రాప్తాడు ఎంపిడిఒ కార్యాలయంలో మహిళలకు ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టాల రిజిస్ట్రేషన్‌కు లబ్ధిదారుల నుంచి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆడపడుచునూ తన సొంత అక్కచెల్లెమ్మలుగా భావిస్తున్న సిఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'శ్రీ చైతన్య'లో టీచర్ల ఎంపిక

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్చి 3, 9, 10వ తేదీల్లో అనంతపురం జోన్ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో అభ్యర్థులను నియమించనున్నట్లు ఎజిఎ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి శ్రీచైతన్య విద్యాసంస్థ తనవంతు తోడ్పాటును అందిచడంలో భాగంగా నగరంలోని కమ్మభవన్, లక్ష్మీ శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించడానికి ప్రిన్సిపళ్లు, వైస్ ప్రిన్సిపళ్లు, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ, హై స్కూళ్లు చెందిన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్, పిఇటిలు, కంప్యూటర్, అకౌంట్స్, స్టోర్ ఇన్‌ఛార్జిలు, డిటిపి ఆపరేటర్లు, క్యాంపస్ ఎఒ, హాస్టల్ వార్డెన్ల విభాగాల్లో అర్హత, అనుభవం ఉన్న వారిని నియమించనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపిపి

కుందుర్పి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి కమలా నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని ఎనుములదొడ్డి పంచాయతీలో సర్పంచి మహదేవమ్మ తనయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణశాస్త్రి, రాధాస్వామి, భీమరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సచివాలయ ఈ.రాము, ముజువుల్లా, తిప్పేస్వామి, లింగప్ప, మారుతీశ్వరి రామ్మూర్తి, లలితమ్మ బొమ్మయ్య, గంగాధర్, ప్రభాకర్, ఎస్.మల్లాపురం నరసింహులు, బొమ్మలింగ, ఆనంద్, తిప్పేస్వామి, చిన్నప్ప, హనుమంతురాయుడు, ఉమేష్, మాజీ సర్పంచి శివశంకర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడుకు నివాళి

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత కోకిల, కవయిత్రి సరోజినీనాయుడు 75వ వర్ధంతిని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గుత్తి పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు వెంకటేష్, నారాయణరెడ్డి, శామ్యూల్, గోవిందప్ప, నారాయణశెట్టి, షేక్షావలి, మద్దిలేటి, వెంకటనారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

ఇంటి, ఆస్తి పన్నులపై వడ్డీమాఫీ

కళ్యాణదుర్గం : ఏకకాలంలో ఇంటి, ఆస్తి పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 35 ఎంఎ ప్రకారం ఫిబ్రవరి 29 నుంచి మార్చి 31వ తేదీ వరకూ వడ్డీ రాయితీ ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పలు సమస్యలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతపై అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఫొటో మిక్సింగ్ క్యాప్సర్, హౌసింగ్ సైట్ రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలని సూచించారు. అలాగే రాబోయే సాధారణ ఎన్నికల్లో వాలంటీర్లను ఎన్నికల కార్యక్రమాలకు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, శ్రీరాములు, గోపాల్, రమణమూర్తి, మమత, అశోక్, శమంతకమణి పాల్గొన్నారు.

కోడిగుడ్లు సరఫరా చేసే ఏజెన్సీని రద్దు చేయాలి

ఉరవకొండ : ఉరవకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వజ్రకరూరు మండలంలో అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేసే కోడిగుడ్ల ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉరవకొండలోని ఐసిడిఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్లకు పూర్తిగా చెడిపోయిన గుడ్లను సరఫరా చేస్తున్నారన్నారు. వీటిని తిన్న చిన్నపిల్లలు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు, కిశోర బాలికలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం కోడిగుడ్లను సరఫరా చేస్తున్న ఏజెన్సీని రద్దుచేసి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు రాము, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మధు, తదితరులు పాల్గొన్నారు.

'సరస్వతీ విద్యామందిరం' వార్షికోత్సవం

పామిడి : మండల కేంద్రంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాల 48వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయానంద స్వామీజీ మాట్లాడుతూ సరస్వతీ విద్యామందిరం ప్రారంభించి 48 సంవత్సరాలు అవుతున్నా ప్రజల ఆదరాభిమానాలు పొందుతుండటం సంతోషకరమన్నారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ విద్యావేత్తల ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, శోభ మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్, విద్యామందిరం కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డి వారధి ప్రారంభం

శింగనమల : మండలంలోని తరిమెల నుంచి చిట్టూరు వరకూ ఎంపీ నిధులు రూ.190 లక్షలతో నూతనంగా నిర్మించిన లో లెవెల్ పైప్ కల్వర్టును జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. రాబోవు రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో నడవడానికి ప్రజలందరూ మరోమారు జగనన్నను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రామాంజనేయులు, జడ్పీటీసీ సుధ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ పంట నమోదుపై గ్రామసభ

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం ఏ.నారాయణపురం రైతుభరోసా కేంద్రంలో రబీ 2023-24 ఈ-పంట నమోదు సామాజిక తనిఖీపై శనివారం గ్రామసభ నిర్వహిచారు. ఈ సందర్భంగా అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయసంచాలకులు ఎం.రవి మాట్లాడుతూ రూరల్ మండలం పరిధిలో రబీకి సంబంధించి 880 మంది రైతులు 2188.02 ఎకరాల్లో పంట నమోదు చేయించారన్నారు. వారి వివరాలను ఆయా ఆర్‌బికెల్లో పొందుపరిచామన్నారు. వాటిని అభ్యంతరాలు ఉంటే ఈనెల5వతేదీలోపు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్, ఎ.నారాయణపురం ఆర్‌బికె అధికారిణి నాగలత, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో వేరుశనగ కొనుగోలు

అనంతపురం : జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో వేరుశనగ పండించిన రైతుల నుంచి మద్దతు ధర క్వింటా రూ.6377తో కొనుగోలు చేయనున్నట్లు ఎపి మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నీశ్వరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో వేరుశనగ పండిచిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.


వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేస్తుకున్న అభ్యర్థులకు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పురపాలక సంఘం పరిధిలో 14 వార్డు వాలంటీర్ల పోస్టులకు 30 మంది దరఖాస్తు చేసుకోగా 19 మందికి ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కమిషనర్ తెలిపారు.

కోట పాఠశాలలో సైన్స్ దినోత్సవం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విఎం.సుబహాన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్యాముల్ ప్రతాప్,నాగమణి, చంద్రకళ, రఘువీరా, పులికొండ, శ్రీరామిరెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

వేసవి తాపం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి మొదలవడంతో వేసవి తాపం పెరుగుతోంది. వారం రోజులుగా ఎండలు మండుతున్నాయి. జనాలు మధ్యాహ్నం సమయంలో బయటకు రావాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి తాపానికి తోడు 2023లో వర్షాభావం కూడా తోడవడంతో నీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే అనేక గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సత్యసాయి జిల్లాలో సుమారు 200 గ్రామాలకుపైగా రవాణా ద్వారా నీటిని అందించాల్సి వస్తోంది. ఇంకా ఎండలు మండి వేసవి తాపం పెరిగితే తాగునీటి కష్టాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లోనూ కొన్ని చోట్ల ఖాళీ బిందెలతో జనాలు నిరసనలకు దిగుతున్నారు. ఎన్నికల సమయం కూడా ఆసన్నమవడంతో నేతలు ప్రజలపై ఎక్కడాలేని ప్రేమను కనబరుస్తున్నారు. నీటి సమస్య ఉందన్న వెంటనే ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని తోలుతున్నారు. ఎన్నికల సమయం కూడా దగ్గరపడుతోంది. వారానికో ప్రధాన పార్టీ రాజకీయ సభను ఏర్పాటు చేస్తోంది. మొదట వైసిపి సిద్ధం సభను ఏర్పాటు చేస్తే ఆ తరువాత వారంలో కాంగ్రెస్ ప్రచారాన్ని అనంతపురం జిల్లా నుంచి ప్రారంభించింది. వచ్చే వారం టిడిపి కదలిరా పేరుతో పెనుకొండలో సభకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అభ్యర్థులు కూడా ఖరారై ఉండటంతో ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. నేతలు ఓటర్లను కలుసుకునే ప్రయత్నాలు ఇప్పటికే ముమ్మరం చేస్తున్నారు. అక్కడక్కడ సొంత పార్టీలో అసమ్మతులున్నా వారిని కలిసి బుజ్జగించి మద్దతు కూడగట్టే పనిని చేపడుతున్నారు. అందులో ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో ఈవారంలో టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గతవారంలో కళ్యాణదుర్గం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అసమ్మతి నేతలున్నా తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే వైసిపి అభ్యర్థి తలారి రంగయ్య రోజుకో గ్రామం వెళ్లి ప్రజలను కలుసుకునే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. రాయదుర్గంలోనూ టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, వైసిపి అభ్యర్థి మెట్టుగోవిందరెడ్డి వరుస కార్యక్రమాలతో బిజీబిజీగా ఉన్నారు. ఇక టిడిపి రాప్తాడులో రా కదలిరా కార్యక్రమం నిర్వహించాలని మొదట తలపెట్టారు. అయితే చివరి నిమిషంలో పెనుకొండకు మార్పు చేశారు. పెనుకొండలో ఈ సభను ఈనెల నాలుగో తేదిన ఏర్పాటు చేస్తున్నారు. దీనికి చంద్రబాబు వస్తున్నారు. తాడిపత్రిలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మరోమారు తాగునీటి సమస్యపై ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇలా వరుసగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. వీడి నడుమ ప్రజా సమస్యలు పెద్దగా చర్చకు రావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023లో ఖరీఫ్‌లో పంటనష్టం వాటిల్లింది. రూ.250 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం తక్షణం పరహారం అందజేస్తుందా లేదా అన్న చర్చ రైతుల్లో నడుస్తోంది. ఇది ఇవ్వకుండా రైతు భరోసాను ఇస్తోంది. అదే విధంగా తాగునీటి ఇక్కట్లు పెరుగుతున్నాయి. వీటి పరిష్కారానికి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేవి ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లోపు వీటిపై దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. కాని పాలకులు ఎన్నికల్లో తలమునకలై ప్రజా సమస్యలను గాలికొదిలేసే విధంగానున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.